
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 23 ఫిబ్రవరి 2025



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



జన్వాడలో హార్స్ రైడింగ్ పోటీలు ప్రారంభం

జాతీయ పోటీలకు అర్హత సాధించిన ఐజామీర్



హార్స్ రైడింగ్ చేస్తున్న ఐజా మీర్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జన్వాడలో ఈక్వేస్ట్రియన్ క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈక్వేస్ట్రియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ జూనియర్ హార్స్ రైడింగ్ క్వాలిఫైయింగ్ పోటీలు శనివారం నాసర్ పోలో గ్రౌండ్‌లో జరిగాయి. ఈ పోటీలలో దేశవ్యాప్తంగా ఉన్న యువ రైడర్లు పాల్గొన్నారు. సీహెచ్1, సీహెచ్2, యంగ్ రైడర్స్ కేటగిరీలలో జంపింగ్ ఈవెంట్స్ నిర్వహించగా ఐజామీర్ ఈఎఫ్ఐ రైడర్ తన గుర్రం డెలానోపై అద్భుత ప్రదర్శన కనబరిచింది. దీంతో ఆమె ఢిల్లీలో జరిగే నేషనల్స్ పోటీలకు అర్హత సాధించింది. నాసర్ పోలో సీఈఓ మీర్ అహ్మద్ పర్యవేక్షణలో ఈవెంట్ జరుగగా, న్యాయ నిర్ణేతలుగా కల్నల్ దుశ్యంత్ బాలి, కల్నల్ ఎస్ఎల్.రెడ్డి వ్యవహరించారు. పోటీలకు ముందు డాక్టర్ రవీందర్‌రెడ్డి గుర్రాల ఆరోగ్యాన్ని పరిశీలించి వాటి ఫిట్‌నెస్‌ను నిర్ధారించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో రేపు మధ్యాహ్న వంట బంద్

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 24న ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న వంట బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వై.స్వప్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10 వేల వేతనం ఇస్తామన్న హామీ నెరవేర్చాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేస్తూ సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. గత ఏడాదిలో రెండు నెలలకు సంబంధించిన కోడిగుడ్ల బిల్లు రావాల్సి ఉందన్నారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు.



విదేశీ విద్యకు ప్రోత్సాహం!

విదేశాల్లో చదువుకోవాలనే ఆశ విద్యార్థులకు ఉంటుంది. ప్రతిభ ఉన్నా పేదరికం అడ్డుగా మారడంతో చాలామంది విదేశీ విద్యకు దూరమవుతున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. అంబేద్కర్ ఓవర్సీస్ ఇండియా నిధి పథకం ద్వారా విదేశీ విద్యకు ప్రోత్సాహం అందిస్తోంది. విదేశాల్లో సీటు సాధిస్తే చాలు రూ.20లక్షల రుణం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చాలామంది విద్యార్థులు ఈ పథకం కింద సాయం పొంది విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాది కూడా మరికొందరు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఆర్థిక సాయం


- రాష్ట్రంలోనే అగ్రస్థానంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా
- మేడ్చల్ జిల్లాలో గతేడాది 29, ఈ ఏడాది 25 మందికి చాన్స్
- విదేశాల్లో సీటు వస్తేచాలు రూ.20 లక్షల రుణం
- అధికంగా దరఖాస్తు చేసుకుంటున్న ఎస్సీ విద్యార్థులు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా విదేశాల్లో చదువుకునేందుకు ఎస్సీ విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు తెలంగాణ ప్రభుత్వం 2015 నుంచి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తోంది. రాష్ట్రంలో డిగ్రీ పూర్తిచేసిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీల్లో సీట్ వస్తే చాలు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. దీంతో విద్యానిధి పథకానికి జిల్లా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మొదట్లో ఒక్కో విద్యార్థికి రూ.10 లక్షలు అందించేవారు. అవిసరిపోక అప్పులు చేయాల్సి వస్తుందని విదేశాల్లో చదివేందుకు ఎస్సీ విద్యార్థులు ముందుకు రాలేదు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం మళ్లీ పథకం నిబంధనలు సడలించి సాయాన్ని రూ.20 లక్షలకు పెంచింది. దీంతో రాష్ట్రానికి చెందిన ఎస్సీ విద్యార్థులు విదేశీ విద్య కోసం వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు.

రంగారెడ్డి జిల్లాలో...

రంగారెడ్డి జిల్లాలో 2023-24 సంవత్సరంలో 28 మంది విద్యార్థులకు

మిగతా 7వ పేజీలో...



అర్హతలు..

ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం పొందాలనుకునే విద్యార్థులు జీఆర్ఈ, టోఫెల్ వంటి ఎంట్రెన్స్ పరీక్షల్లో కనీసం 60శాతంతో ఉత్తీర్ణత సాధించాలి. విదేశాలకు చెందిన యూనివర్సిటీల నుంచి అడ్మిషన్ పొంది ఉండాలి. వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపే ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని రాష్ట్ర, జిల్లా స్థాయిలో విచారణ జరిపి మెరిట్ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తారు.

ఏడాదిలో రెండు విడతల్లో ఎంపిక



పేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షలు ఆర్థిక సాయం అందిస్తుంది. గత ఏడాది రంగారెడ్డి జిల్లాలో 12 మంది విద్యార్థులకు రూ. 3.40 కోట్లు సాయం చేయడం జరిగింది. ఈ సారి 10 మంది విద్యార్థులను ఎంపిక చేశాం. రూ.1.72 కోట్లు మంజూరయ్యాయి. ఏటా రెండు విడతల్లో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తున్నాం.

రామారావు, షెడ్యూల్డ్ కులాల రంగారెడ్డి జిల్లా అభివృద్ధి అధికారి

కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తున్న కేంద్రం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మహేశ్వరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థల కోసం తప్ప.. కార్మికులు, కష్టజీవులకు ఉపయోగపడేలా లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. శనివారం తుక్కుగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశాడని ఆరోపించారు. అదే విధంగా కులవృత్తులకు, దళిత, గిరిజనుల అభివృద్ధికి మొండి చేయి చూపించారన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని, ఈ సెమినార్‌ను మార్చి 11న తుక్కుగూడలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమ విజయవంతానికి ప్రజలు, పార్టీ అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు రవీంద్రచారి, పర్వతాలు, దత్తునాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, దేవేందర్, బ్రహ్మచారి,ఆనంద్ పాల్గొన్నారు.

చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు

చరిత్రను చాటుతూ నేటికీ చెక్కు చెదరకుండా దర్శనమిస్తున్నాయి కొన్ని పురాతన కట్టడాలు. నిజాం కాలంలో నిర్మించిన కట్టడాలు మేడ్చల్ ప్రాంతానికి చిహ్నంగా నిలిచాయి. ఆ చారిత్రాత్మక కట్టడాలను ఎవరూ పట్టించుకునే వారు లేనప్పటికీ స్థానికులు మాత్రం తమ పూర్వీకులు వదిలి వెళ్లిన ఆస్తులుగా భావిస్తుండడం విశేషం. వందల ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ ఆ నిర్మాణాలు దృఢంగా దర్శనమిస్తున్నాయి. నవాబుల కాలంలో ఆలయాలు, మసీదులు, గ్రామ రక్షణ కోసం ఏర్పాటు చేసిన బురుజులతో పాటు, వంతెనలు, వాగులు ప్రత్యేకంగా నిర్మించారు. ఇందులో ఆలయాలు, మసీదులు, బుర్జులు చెక్కు చెదరకుండా కనబడుతున్నాయి.

బండమాదారంలో బురుజు



Sunday Special

- వందల ఏళ్ల క్రితం నిర్మాణం ● నేటికీ చెక్కుచెదరకుండా దర్శనం
- మేడ్చల్ రామలింగేశ్వరస్వామి ఆలయం
- కొత్తదనంతో దర్శనమిస్తున్న ఖుతుబ్‌షాహీ మసీదు, బురుజులు
- పూర్వీకుల ఆనవాళ్లను కాపాడుతున్న ప్రజలు



నూతన్‌కల్ గ్రామ బురుజు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 22: మేడ్చల్ పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయానికి నాలుగు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. నిజాం కాలంలో మేడ్చల్ జాగీర్దార్‌గా ఉన్న దాత్రిక రాజలింగం కలలో రామలింగేశ్వరుడు దర్శనమిచ్చి తనకో ఆలయం నిర్మించాలని కోరగా మేడ్చల్ గ్రామ శివార్లలోని గుట్టల్లో ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయ కీర్తి పెరిగి చివరికి గ్రామ కులదైవంగా మారింది. రాతి శిలల మధ్య ఆలయాన్ని నిర్మించడం విశేషం. ఆనాటి నుంచి నేటి వరకు ఆలయానికి ధర్మకర్తలుగా దాత్రిక వంశీయులు వ్యవహరిస్తూ ప్రతీ ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తూ తమ పూర్వీకులు నిర్మించిన ఆలయానికి వన్నె తీసుకొస్తున్నారు.

చెక్కుచెదరని ఖుతుబ్‌షాహీ మసీదు

హైదరాబాద్‌లోని గోల్కొండ నవాబులు కులీఖుతుబ్ షా పాలనలో మేడ్చల్ ప్రాంతంలో నిర్మించిన ఖుతుబ్ షాహీ(పెద్ద మసీదు)కు ప్రత్యేకతను కనబరుస్తోంది. మసీదు నిర్మాణం

మిగతా 7వ పేజీలో...

అక్రమ కట్టడాల కూల్చివేత

షాద్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామ సమీపంలో ఉన్న వీరమోనికుంట చెరువు వద్ద నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను ఆర్అండ్‌బీ అధికారులు శనివారం కూల్చివేశారు. వీరమోనికుంట చెరువును ఆనుకుని ఉన్న వ్యవసాయ భూమిలోకి చెరువు నుంచి పారే అలుగు నుంచి నీటి ప్రవాహం రాకుండా ఆ భూ యజమాని చుట్టూ ప్రహరీ నిర్మించారు. దీనిపై కొన్ని నెలలుగా భూ యజమాని, సమీప రైతుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. మూడు నెలల క్రితం ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు నీటి పారుదల శాఖ అధికారులు జోక్యం చేసుకొని ఆక్రమణలను తొలగించారు. కానీ సదరు భూ యజమాని శుక్రవారం అర్ధరాత్రి ఆర్అండ్‌బీ స్థలంలో కాలువల నిర్మాణం చేపట్టాడు. ఈ విషయాన్ని గమనించిన షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేయగా వాటిని కూల్చివేశారు.



వీరమోనికుంట వద్ద అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

గ్రామాల్లో అభివృద్ధి పనులు భేష్

కందుకూరు మండలంలో పర్యటించిన కేంద్ర బృందం



రాచులూరులో పాడి పశువులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కందుకూరు,ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలంలోని గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు బాగున్నాయని కేంద్ర బృందం కితాబు ఇచ్చింది. శనివారం రాచులూరు, తిమ్మాపురం, లేమూరు గ్రామాలలో వారు పర్యటించారు. డీఆర్‌డీవో శ్రీలత, డీపీవో సురేష్‌మోహన్, హౌజింగ్ ఎస్సీ భాస్కర్‌లు అభివృద్ధి పనుల గురించి కేంద్ర బృందానికి వివరించారు. ఈ సందర్భంగా తిమ్మాపురం గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలపై ఆరా తీశారు. కూలి పెంచాలని, 250 రోజులు పని కల్పించాలని కూలీలు వారిని కోరారు. అలాగే గడ్డపార చార్జీలను ప్రభుత్వం కట్టివ్వాలని, పని పరిమాణం తగ్గించాలని విన్నవించారు. తర్వాత రాచులూరు గ్రామంలో పళ్ల తోటల పెంపకం, క్యాటిల్ షెడ్డును సందర్శించారు. అనంతరం గ్రామంలోని పోస్టు ఆఫీసును సందర్శించారు. పెన్షన్‌దారులకు ప్రతీనెల ఎలా డబ్బులు చెల్లిస్తున్నారని తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారుల ఎంపిక ఎలా జరుగుతుందని, అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని కేంద్ర బృందం సూచించారు. లేమూరు గ్రామంలో ప్రధానమంత్రి సడకర్ యోజన పథకం ద్వారా నిర్మించిన రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్ర బృందం సభ్యులు ఒడిశాకు చెందిన మాజీ ఏఎస్‌సీ, డాక్టర్ ఎస్‌సీ పాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎకనామిక్స్ విభాగం కాశ్మీర్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జావిద్‌ఇక్బాల్‌ఖాన్, చండీగఢ్ రాష్ట్ర సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ రూరల్ అండ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వికాష్‌కుమార్, కోల్‌కతా ఐఏఎం ప్రొఫెసర్ డాక్టర్ అవిజిత్‌దాస్‌లు ఉన్నారు. కార్యక్రమంలో హౌజింగ్ పీడీ చాంప్లా, పంచాయతీ రాజ్ డీఈ అనిల్, ఎంపీడీవో సరిత, ఏపీడీ నరేందర్‌రెడ్డి, చరణ్, ఎస్పీఎంలు మురళి, కృష్ణమూర్తి, ఎంపీవో గీత, పంచాయతీ రాజ్ ఏఈ సతీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, వెంకట్‌రెడ్డి, ఏపీవో ఎన్ను రవీందర్‌రెడ్డి, ఈసీ సుగుణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఆర్‌డీవో సిబ్బంది పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి కాటం స్వరూప

ఆమనగల్లు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజమార్గమని ఆమనగల్లు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. శనివారం ఆమనగల్లు కోర్టు ఆవరణలో మార్చి 8న నిర్వహించే లోక్ అదాలత్‌పై శనివారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌ల గురించి కక్షిదారులకు సమాచారం అందివ్వాలని, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. కక్షిదారులు సైతం కోర్టులు, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆమనగల్లు సీఐ శివప్రసాద్, మాడ్గుల సీఐ వేణుగోపాల్, ఎస్ఐలు వెంకటేశ్, వరప్రసాద్, శ్రీధర్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

అధికారులతో సమావేశమైన మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



మహేశ్వరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తుక్కుగూడ మున్సిపాలిటీ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆదేశించారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో అసంపూర్తిగా ఉన్న పనులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలన్నారు. కమిషనర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దోమ, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో రేణుకాదేవిఅన్నారు. బొంపల్లి పాఠశాలను శనివారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.

ఉద్యోగం ఏదైనా పనితీరే ప్రామాణికం

● ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చేస్తున్నఉద్యోగం ఏదైనా..ఉత్తమ పనితీరునే ప్రామాణికంగా తీసుకుంటారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆబ్కారీ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేకసమావేశంలో హైదరాబాద్, రంగారెడ్డి,. ధూల్‌పేట్, ఎస్‌టీఎఫ్(స్టేట్ టాస్క్‌ఫోర్స్) టీమ్‌లకు ఆయన నగదు రివార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎక్సైజ్‌మంత్రి జూపల్లికృష్ణారావు డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఇచ్చిన అదేశాల మేరకు ఎస్‌టీఎఫ్ టీమ్‌లు బాగా పని చేస్తున్నాయన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత బాగా పని చేయాలని సూచించారు. నగదు రివార్డులు పొందిన వారిలో స్టేట్‌ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నాలుగు టీమ్‌లతోపాటు.. రంగారెడ్డి డివిజన్‌లో 14 మందికి, హైదరాబాద్ డివిజన్ నుంచి ఏడుగురికి, ధూల్‌పేట్‌స్పెషల్ టీమ్‌లో 16 మందికి, ఎస్‌టీఎఫ్ టీమ్‌లోని వివిధ భాగాల్లో 61 మందికి రివార్డులు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కేఏబీ శాస్త్రీ, జాయింట్ కమిషనర్ ప్రణవీ, అనిల్‌కుమార్ రెడ్డి ఏ,బీ టీమ్‌ల ఎక్సైజ్ సూపరిండెంట్ నంద్యాల అంజి రెడ్డి, ప్రదీప్‌రావు, డీఎస్పీ తిరుపతి యాదవ్, ఏఈఎస్ జీవన్‌కిరణ్, సీఐలు, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు.



కాశీవిశ్వనాథుడిని దర్శించుకున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

కుంభమేళాలో స్పీకర్ పుణ్యస్నానాలు

వికారాబాద్/పరిగి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహాకుంభమేళాలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొని త్రివేణి సంగమంలో పుణ్యసాన్నాలు అచారించారు. అక్కడి నుంచి కాశీవిశ్వనాథ, విశాలాక్షి, కాలభైరవ ఆలయాలను దర్శించుకున్నారు. అలాగే పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తన అనుచరులతోకలిసి త్రివేణిసంగమంలో స్నానాలు ఆచరించారు. అనంతరం అయోధ్యలో బాలరాముడిని దర్శించుకున్నారు.

భద్రేశ్వరుడిని దర్శించుకున్న స్పీకర్ సోదరీమణులు

తాండూరు: పట్టణంలోని భద్రేశ్వర ఆలయంలో శ్రీ బావిగి భద్రేశ్వర స్వామిని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ సోదరీమణులు శోభ, వీణా, ప్రియా, బావరాధాకృష్ణ దర్శించుకున్నారు. శనివారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డీఎం అండ్ హెచ్‌వో ఉమాగౌరి సిబ్బందికి సూచించారు. మండలంలోని శ్రీరంగవరం గ్రామ పీహెచ్‌సీ సెంటర్‌ను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఇన్, ఔట్ పేషంట్ల రిజిష్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతిభ, పీహెచ్‌వో ఉషారాణి, పీహెచ్ఎన్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి

మర్పల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకో వాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. శనివారం బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆమె మర్పల్లి ఎస్టీ హాస్టల్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మనోధైర్యంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చన్నారు. బహుమతులు రాని విద్యార్థులు నిరుత్సాహం చెందకుండా పోటీల్లో ఎలా ప్రతిభ చూపాలో నేర్చుకోవాలన్నారు. గ్రామీణ స్థాయికే పరిమితం కాకుండా జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయిల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చాలన్నారు. బాలల హక్కుల కోసం ఎన్నో చట్టాలున్నాయని, వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింగ్‌రావు, టీచర్లు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ఉపయోగం

కోట్‌పల్లి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. మండలం పరిధి ఎన్నారం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కింద ఎన్నారం ప్రాథమిక పాఠశాల ఎంపికైందని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ విద్యార్థుల సామర్థ్యాలను, విద్యార్థులతో చదివించారు. పాఠశాలకు ఐదు కంప్యూటర్ల ను మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం అం గన్వాడీ సెంటర్‌ను పరిశీలించారు. అంతకుముందు కోట్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రప్ప, ఎంపీవో అనంతరాజిరెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పల్లవి, టీచర్ శేఖర్, సీఆర్పీలు నర్సిములు, లావణ్య మహేశ్వరి, హర్షియ తదితరులు ఉన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో నిలబడాలి

ధారూరు: విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. కేజీబీవీలో నియోజకవర్గస్థాయి విద్యార్థినులకు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో పోటీలను ఆమె ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకొని సాధించుకోవాలన్నారు. బాలికలను క్రీడల్లో, విద్యలో ప్రోత్సహించాలని టీచర్లకు సూచించారు. గెలుపొందిన విద్యార్థినిలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా కేజీబీవీల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వేలో భాగస్వాములవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

కీసర రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన సర్వేలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి అన్నారు. కులగణన సర్వేపై శనివారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులు, ఎన్యుమరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ నెల 28 వరకు సర్వే కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఝాన్సీ, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి, నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేశం, నాగారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, పొట్ట శ్రీశైలం, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పురాతన కట్టడాలను పరిశీలిస్తున్న గంగాదేవి

మ్యూజియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

కీసర,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలోని మూతబడిన మ్యూజియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పురావస్తు శాఖ అసిస్టెంట్ టెక్నికల్ డైరెక్టర్ గంగాదేవి అన్నారు. ఈ మేరకు శనివారం కీసరగుట్టలోని పురావస్తు శాఖ అధ్వర్యంలో ఉన్న మ్యూజియాన్ని, విష్ణుకుండీలు నిర్మించిన కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కీసరగుట్ట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు పురావస్తు శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఈ మేరకు మ్యూజియం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఇక్కడి పరిస్థితులపై ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

బ్రహ్మోత్సవాలకు లక్ష్మీవేంకటేశ్వరాలయం ముస్తాబు




చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ముఖ ద్వారం, ఆలయంలోని స్వామివారు

చేవెళ్ల ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చేవెళ్ల శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయం ముస్తాబైంది. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగనున్నాయి. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. 26న ఉదయం అభిషేకం, అర్చన, సాయంత్రం 4గంటలకు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, తీర్థ ప్రసాదాలు నివేదన ఉంటుందని ఆలయ మేనేజర్ (ఈవో) నరేందర్, ధర్మకర్త దేవుని వామనాచార్యులు శనివారం తెలిపారు. 27న అభిషేకం, అర్చనలు, రాత్రి స్వామి దీపోత్సవం, అశ్వవాహన సేవ ఉంటాయని వివరించారు. మార్చి 4న అఖండ హారతి, పూజా కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి తీర్థప్రసాదలను స్వీకరించాలని కోరారు.

కండెన్స్‌డ్ బయోగ్యాస్‌కు ప్రోత్సాహం

● ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తా



సదస్సులో బుక్ ఆఫ్ అబ్‌స్ట్రాక్ట్స్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఆదిభట్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కండెన్స్‌డ్ బయోగ్యాస్ ఆధారిత శక్తి ఉత్పాదక కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని ఐఐఐటీ ఆర్.కే.వ్యాలీ డైరెక్టర్, ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా అన్నారు. మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ కంప్యూటరింగ్, సస్టెయినబుల్ డెవలప్‌ఎమెంట్ అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పునరుత్పాదక రంగానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించి కాలుష్య రహిత భారతదేశంగా మార్చేందుకు విద్యార్థులు కృషిచేయాలన్నారు. సాంకేతికరంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ సమ్మేళనంలో బుక్ ఆఫ్ అబ్‌స్ట్రాక్ట్స్ ప్రొసీడింగ్స్‌ని ఆవిష్కరించారు. సదస్సుకు 350 పేపర్లు రాగా అందులో 140 పేపర్లను ఎంపికచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో తెలంగాణ నుంచి 71 పేపర్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాసాని రామ్మోహన్‌రెడ్డి, అకాడమిక్ డీన్ నయనతార, వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, డీన్ ప్రొఫెసర్ లాల్‌కిషోర్, డాక్టర్ శ్రీలక్ష్మి, లోకేశ్వర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద ప్లాస్టిక్‌ను నిషేధిస్తాం



సదస్సులో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాంబండ ఆలయం వద్ద ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్‌రెడ్డి తెలిపారు. జీవమిత్ర ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. శివరాత్రి సందర్భంగా త్వరలో జరిగే జాతర ఉత్సవాల్లో పూర్తిగా ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తామని తెలిపారు. బయోడిగ్రీ ఆర్గానిక్ కవర్లు ఉపయోగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోలు బాలనర్సయ్య, నరేందర్, అర్చకులు పాండు శర్మ, జీవమిత్ర ఆర్గనైజేషన్ నిర్వాహకులు సాయి భరత్‌కుమార్‌గౌడ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు

(5వ పేజీ తరువాయి)



రామలింగేశ్వరస్వామి ఆలయం

చేపట్టి దాదాపు 400 సంవత్సరాలు పైబడుతున్న మసీదు చెక్కు చెదరకుండా ఉంది. ఈ మసీదు నమూనాతో నగరంలోని పలు చోట్ల ఖుతుబ్ షాహీ నవాబులు మసీదులు నిర్మించారు. ఎత్తయిన స్థలంలో నాలుగు దిక్కుల విశాలమైన స్థలం వదుతూ ముందు పైన ముందు భాగంలో పెద్ద మినార్లు, వెనుక భాగంలో చిన్న పాటి మినార్‌లతో నిర్మించిన ఈ మసీదు నేటికీ చూపరులను ఆకట్టుకుంటోంది. పూర్వ మేడ్చల్ పట్టణానికి చేరుకునే వారికి కిలోమీటర్ల దూరం నంచే ఈ మసీదు ముందు భాగంలో నిర్మించిన మినార్లు కనబడతాయి. మసీదు మినారుల ఆధారంగా దూరం నుంచే ప్రయాణికులు తాము వెళ్లాల్సిన మార్గాన్ని తెలుకునే వారు. దీంతో మసీదును స్థానికులు తమ గ్రామ చరిత్రను చాటే చిహ్నంగా పేర్కొంటారు.

రాతి కట్టడాలతో బురుజులు



డబిల్‌పూర్‌లో బురుజు

పూర్వం గ్రామంలో కొత్త వారు ప్రవేశించకుండా గ్రామ సరిహద్దుల్లో రాతి బురుజులు నిర్మించారు. మేడ్చల్ మండలం డబిల్‌పూర్, నూతన్‌కల్, బండమాధారం గ్రామాల్లో నేటికీ బురుజులున్నాయి. వందల ఏళ్ల క్రితం గ్రామ రక్షణ కోసం పెద్దబండరాళ్లు పేర్చి నిర్మించిన బురుజులు ధృడంగా ఉన్నాయి. గ్రామాల్లో ప్రవేశించే వారి కోసం గ్రామ శివార్లలో ఒక బురుజు, రాత్రి వేళ దొంగతనాలను అరికట్టేందుకు గ్రామ నిడిబొడ్డున మరో బుర్జు కట్టి వాటిల్లో రక్షకభటులను ఉంచేవారు. బండమాధారంలో 300ఏళ్ల నాటి బురుజు నేటికీ కొత్తగానే ఉంది. ఈ బురుజుకు మధ్యన వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలను నిర్మించి యేటా జాతర నిర్వహిస్తున్నారు. జాతీయ పర్వదినాలప్పుడు వాటిపై జాతీయ జెండాను ఆవిష్కస్తారు. తరాలు మారినా... మారని పురాతన కట్టడాలను స్థానికులు పూర్వీకుల ఆస్తిగా భావించటం గమనార్హం.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.13కోట్లు



సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):కల్వకుర్తి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.13కోట్లు మంజూరు చేసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంజూరైన నిధులతో అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు సర్వే నంబర్ 256లో స్థల పరిశీలన చేశారు. గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన జంగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏడు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ప్రతి మండలంలో ఒక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో శ్రీకాంత్, నాయకులు అజీం, వెంకట్‌రెడ్డి, రఘురాములు, ఆరీఫ్, డేవిడ్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్ యాదవ్, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

చదువులో రాణిస్తేనే భవిష్యత్తు



విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సర్దార్‌నగర్, మన్‌మర్రి, రేగడిదోస్వాడ, తాళ్లపల్లి, హైతాబాద్, పోత్‌గల్, షాబాద్‌లోని బాలుర, బాలికల, కేజీబీవీ, మోడల్‌స్కూల్ పాఠశాలతోపాటు పలు ప్రైవేట్ స్కూళ్లలో 860 మంది విద్యార్థులకు శనివారం ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ అభిరామ్‌రెడ్డితో కలిసి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, కంపాక్స్‌లు, ఇతర స్టేషనరీ వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌నాయక్, నర్సింహులు, నాయకులు శ్రీనివాస్, శేఖర్, జంగయ్య, ఆంజనేయులు, థౌసిఫ్, రఫీక్, దయాకర్, సూర్య పాల్గొన్నారు.

ప్రజాపాలనకు ఆకర్శితులై కాంగ్రెస్‌లో చేరికలు : కేఎల్లార్



బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న కె.లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):ప్రజాపాలనకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింతబలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం సిరిగిరిపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింహాగౌడ్ ఆధ్వర్యంలో తుక్కుగూడలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టపడే కార్యకర్తలను కాంగ్రెస్ మరిచిపోదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజునాయక్, మల్లేష్, వెంకటేష్, బాల్‌రాజ్, శ్రీను,మహేందర్,రాఘవేందర్, గణేష్, శ్యామ్, సోమేష్, శ్రీను, కొమురయ్య, హరీష్, పవన్ పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న పి.శ్రీనివాస్

తాండూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎంఈవో వెంకటయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. అనుమతుల్లేని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫ్యూచర్ సిటీకి సహకరించాలి



మాట్లాడుతున్న భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ వరకు 330ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్న రోడ్డు పనులకు రైతులు సహకరించాలని, రోడ్డుకు భూములు కోల్పోయే రైతులకు పరిహారం ఇచ్చాకే పనులు ప్రారంభిస్తామని భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం తిమ్మాపురం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహేశ్వరం మండలం రావిరాల ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి మండలంలోని మీర్కాన్‌పేట రెవెన్యూ బేగరికంచ వరకు మొదటి విడతలో 330ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రోడ్డుకు భూములు కోల్పోయే రైతుల్లో కొందరు ఇటీవల ఇచ్చిన అభ్యంతరాలపై తిమ్మాపురం రైతులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో కొందరు రైతులు బహిరంగ మార్కెట్ ధరతో పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యాదగిరి, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయొద్దు

● రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ



రోడ్డు పక్కన మెస్ నిర్వహిస్తున్న వారితో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఇష్టానుసారం దుకాణాలు, వాహనాలను పార్క్ చేస్తే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ హెచ్చరించారు. శనివారం ఆయన మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్‌తో కలిసి అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, అమ్డాపూర్ చౌరస్తా వరకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గించొద్దని చెప్పారు. రోడ్డుకు ఆనుకొని దుకాణాలను ఏర్పాటు ప్రమాదాల జరుగుతాయని, అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... రోడ్డు పక్కన చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ రాజేందర్ గౌడ్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



విద్యార్థులను అభినందిస్తున్న లక్ష్మణ్

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషిచేయాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ లక్ష్మణ్ అన్నారు. చంద్రాయన్‌పల్లి కేజీబీవీలో బాలల హక్కులపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, అపర్ణ, భ్రమరాంబ, నూర్జాహ, పార్వతీ పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ప్రోత్సాహం!



(5వ పేజీ తరువాయి)

సంబంధించి విదేశీ విద్యను అభ్యసించేందుకు ప్రతిపాదించగా, అందులో 12 మందికి రూ.3.40కోట్లు మంజూరు కాగా అన్ని నిధులను ఖర్చు చేశారు. ఈ సారి 42 మంది విద్యార్థులకు సంబంధించి ప్రతిపాదించగా, 10 మంది విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ఆర్థిక సాయం అందించేందుకు రూ.1.72 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో ఇప్పటి వరకు రూ.1.20కోట్లు ఖర్చు పెట్టారు. మరికొందరు విద్యార్థులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

టాప్‌లో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా..

ఈ పథకం అమలులో మేడ్చల్-మల్కాజిగిరి పరుగులు తీస్తోంది. రెండు పర్యాయాలుగా ఉన్నత స్థానంలో నిలుస్తోంది. ఈ సారి కూడా టాప్‌లో నిలిచింది. గత సంవత్సరం మేడ్చల్ జిల్లాలో 64 మంది విద్యార్థులు విదేశీ విద్య రుణం కోసం దరఖాస్తు చేసుకోగా 29 మంది అర్హత సాధించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 53 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ప్రస్తుతం అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తుంది. అందులో దాదాపు 25 మంది విద్యార్థులు అర్హత సాధించే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను మెరిట్ ద్వారానే అధికారులు ఎంపిక చేస్తారు. 78.4 శాతాన్ని అధికారులు కటాఫ్‌గా నిర్ణయించారు.

రూ.20లక్షల వరకు ఆర్థిక సాయం

నేడు ఎంతోమంది విద్యార్థులు స్వదేశంలో డిగ్రీ పూర్తిచేసి ఉన్నత విద్య కోసం అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు తరలిపోతున్నారు. విదేశాలలో పీజీ చేయాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినీ విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ ఇండియా నిధి పథకం కింద ఆర్థిక సాయం అందించి ప్రోత్సహిస్తున్నారు. రెండు దశల్లో రూ.20లక్షల ఆర్థికసాయం బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్నారు. వీసా ఫీజు, ఎయిర్ టికెట్ ఖర్చులు రూ.50వేల వరకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. యేటా తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ పథకం ద్వారా 220 మంది విద్యార్థులు విదేశీ విద్యకు అర్హత సాధిస్తున్నారు.

సంవత్సరం	విద్యార్థుల ప్రతిపాదనలు	మంజూరైన విద్యార్థుల సంఖ్య	విడుదలైన నిధులు(రూ.కోట్లు)	ఖర్చు (రూ.కోట్లు)
రంగారెడ్డి జిల్లా				
2023-24	28	12	3.40	3.40
2025-26	42	10	1.72 కోట్లు	1.22
మేడ్చల్				
2023-24	69	29	5.80	5.80
2025-26	52	25	5	5
వికారాబాద్				
2023-24	07	ప్రాసెస్‌లో	0	0
2025-26	05	ప్రాసెస్‌లో	0	0

మేడ్చల్ జిల్లాలో ఈ ఏడాది 25 మందికి చాన్స్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గతేడాది రెండు దశల్లో కలిపి 29 మందికి విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఆర్థిక సాయం లభించింది. అదేవిధంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 52 మంది దరఖాస్తు చే సుకోగా, అందులో దాదాపు 25 మందికి అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుదారులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి ని వేదించేందుకు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు.

దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది

విదేశీ విద్యకు ఆర్థికసాయం అందించడంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. 52 దరఖాస్తుల రాగా, వాటిల్లో దాదాపు 25మందికి అవకాశం ఉంటుంది. విదేశీ విద్యకు వెళ్లిన విద్యార్థులు అక్కడి నుం చి కూడా మమ్ములను సంప్రదిస్తున్నారు.

- జి.వినోద్, మేడ్చల్ జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో వసతులు కల్పిస్తాం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీని అన్ని హంగులతో తీర్చిదిద్ది సరిపోను సిబ్బందిని నియమిస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం చింతపల్లిగూడ చౌరస్తా నాగార్జునసాగర్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బ్రాహ్మణపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు వరకు రాందాస్‌పల్లి, మల్‌శెట్టిగూడ, చింతపల్లిగూడ గ్రామాలను కలుపుతూ సీఆర్ఆర్ నిధులు రూ.10.05 కోట్లతో 11.7 కిలోమీటర్లు నిర్మిస్తున్న రోడ్డు పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇబ్రహీంపట్నం పాత పోలీస్ స్టేషన్, ఖానాపూర్‌లలో బస్తీ దవాఖానలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీలో నూతన భవన నిర్మాణానికి గతంలో రామోజీ ఫౌండేషన్ రూ.4 కోట్లు ప్రకటించిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి నాగన్‌పల్లి వరకు రూ.60 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, జిల్లా అర్బన్ ప్రోగ్రాం వైద్యాధికారి వినోద్, జిల్లా ఉప వైద్యాధికారి సుధామాదవి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సరిత, డాక్టర్ అఖిల్, డాక్టర్ కీర్తన, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరుణాకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్రవంతి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆలయ భూముల అన్యాక్రాంతం కానీయం

ఆలయ భూములను అన్యాక్రాంతం కాకుండా చూస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పోచారంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కొంత నిధిని అందజేయనున్నట్లు తెలిపారు. ఆలయ భూమిని కొందరు అక్రమంగా కాజేసే యత్నం చేశారని, చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కమిటీకి సూచించారు.

వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద చేపట్టిన వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర బృందం అధికారులు ఆదేశించారు. పీఎంజీఎస్‌వై పనుల నిర్వాహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని మేడిగడ్డ తండాలో శనివారం ఒడిశా పీడబ్ల్యూడీ మాజీ ఈఎన్‌సీ డాక్టర్ ఎస్‌సీ పాల్ నేతృత్వంలో కేంద్ర బృందం సభ్యులు మేడిగడ్డ - శంకర్‌కొండ మధ్య పీఎంజీఎస్‌వైలో నిర్మించిన రోడ్డును, కత్వ వాగుపై రూ.3.10 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులకు కేటాయించిన నిధులు, ఖర్చుల వివరాలను పీఆర్‌డీఈ శ్రీనివాస్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల వివరాలను ఎంపీడీఓ కుసుమ మాధురిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల అధికారులతో సమావేశమై పథకాల లక్ష్యాలపై ఆరా తీశారు. డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ మాధురి, ఏఈ అభిషేక్, ఎంపీఓ వినోద, కాంట్రాక్టర్ వెంకటరమణ, పీఎస్ వెంకటయ్య, ఎఫ్‌ఏ రవీందర్ తదితరులు ఉన్నారు.



కత్వ వాగుపై పీఎంజీఎస్‌వైలో నిర్మిస్తున్న వంతెనను పరిశీలిస్తున్న అధికారులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మంత్రి పొన్నంకు ఎమ్మెల్యే వీర్లపల్లి ఆహ్వానం

కొత్తూర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెంజర్ల శివారులోని శ్రీఅనంతపద్మనాభస్వామి ఆలయం(పాత గుడి పునర్నిర్మాణం)లో నిర్వహించే పూజ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కొత్తూర్ మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 24న నిర్వహించే స్వయంభు శ్రీఅనంతపద్మనాభస్వామి అఖండ పూజకు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి హాజరవుతానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొత్తూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఉన్నారు.

బీజేపీతోనే గ్రామాలాభివృద్ధి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని బీజేపీ రంగారెడ్డి ఓబీసీ విభాగం జిల్లా కన్వీనర్ ఎల్గని వెంకటేశ్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన హిమాయత్‌నగర్‌లోని కంజర్ల మాల్‌లో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. అందులో భాగంగానే గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీల నిర్మాణం చేపడతున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలిపించుకోవాలన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సామాజిక సేవలో భాగంగా ఎలిమినేడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణను శనివారం ప్రారంభించారు. కళాశాలలో వరుసగా ఐదు శనివారాలు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్‌సీ శివారెడ్డి తెలిపారు. 8, 9 తరగతుల విద్యార్థులకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ నయనతార, కంప్యూటర్ సైన్స్ హెడ్ డాక్టర్ వాణి వత్సల, అసోసియేట్ ప్రొఫెసర్ సాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారోజు సుధాకర్ పాల్గొన్నారు.

బడికి ప్రొజెక్టర్ వితరణ

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి పాఠశాలకు దాతలు ప్రింటర్, ప్రొజెక్టర్ అందించారు. హైదరాబాద్‌కు చెందిన బుద్దాస్ లైట్ ఇంటర్నేషనల్ చాప్టర్ అధ్యక్షురాలు వెనెరబుల్ ఉపేక్ష మాతాజీ శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందించారు. స్కూల్ ఆఫ్ హోప్ ఇన్‌చార్జి సుజాత బారువా సహకారంతో అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, గ్రామస్తులు సిద్ధార్థ, లక్ష్మారెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్ సూచించారు. శనివారం అజీజ్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజలు నీటి వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో నీటి కనెక్షన్ల వద్ద ఆన్ ఆఫ్‌లు ఏర్పాటు చేసి నీరు వృథాగా అరికట్టాలన్నారు. మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో ప్రజలందరికీ నీరు అందిస్తామని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నీటి ఎద్దడిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



తలకొండపల్లిలో అబుల్ కలాం అజాద్ వర్ధంతి వేడుకల్లో నాయకులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, మైనార్టీ మండల అధ్యక్షుడు ఆరీఫ్, మాజీ ఎంపీటీసీ రాములు, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు రమేష్, సీనియర్ నాయకులు ఓంకారం, డేవిడ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, శేఖర్, బోలా యాదగిరి, గణేష్, జూలపల్లి శ్రీను, పెరుమాండ్ల సురేష్, మల్లేష్, సురేష్, తిరుపతి పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

యాచారం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి 1999 - 2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం రూ.37వేలు సమకూర్చి ప్రధానోపాధ్యాయురాలు ఉదయశ్రీకి అందించారు. పాఠశాలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడానికి తమ వంతు సహకారమందిస్తామని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులతోపాటు ఇతర వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కలకొండ భోజయ్య, నరేందర్‌రెడ్డి, బన్నె శ్రీశైలం, కొండల్‌రెడ్డి, అంజయ్య ఉన్నారు.

విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన



విద్యార్థులతో కనికట్టుపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

చౌదరిగూడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. 'మూఢనమ్మకాలు తప్పని సైన్స్‌తో నిరూపించుట' అనే అంశంపై జీహెచ్ఎం గోపీనాథ్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ అవగాహన కల్పించారు. బాణామతి, చేతబడిపై విద్యార్థులకు పరిశోధనల ద్వారా వివరించారు. కనికట్టు విద్యతో దొంగ బాబాలు ఎలా మోసం చేస్తున్నారో వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్, సామాజిక కార్యకర్త సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి, ఫిబ్రవరి 22:(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఘాతానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన చెవిటి ప్రవీణ్‌కుమార్ మృతిపై కాంగ్రెస్ నాయకులు ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రీశైలం యాదవ్, ఉప్పల చారిటేబుల్ ట్రస్ట్ చైర్మెన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ రూ.9వేలు తక్షణసాయం అందించారు. మహేష్, నరసింహ, రమాచంద్రయ్య, బషీర్, తిరుపతిగౌడ్, చెన్నయ్య, శివ గణేష్, రమేష్, పుల్లయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యాచారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మా సిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు మేడిపల్లి ప్రజలకు సూచించారు. శనివారం గ్రామంలో వాహనాలను తనిఖీ చేశారు. యువకులు గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎక్కడైనా వేధింపులకు గురైతే మహిళలు వెంటనే 100కాల్ చేసి సమాచారమందించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



మోడల్ హౌస్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్లలో ఇందిరమ్మ మోడల్ హౌస్

స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం కోసం అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా పట్టణ కేంద్రంలో మోడల్ హౌస్ నిర్మాణం కోసం స్థలం పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఉన్నారు.

దైవం.. సమాజ శాంతికి దోహదం



పడిపూజలో గూడూరు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సమాజ శాంతికి దైవ కార్యక్రమాలు తోడ్పాడుతాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని శివాలయంలో శనివారం శివస్వాములు నిర్వహించిన పడిపూజకు హాజరయ్యారు. స్వాముల భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డిని నిర్వాహకులు సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేష్, నాయకులు మల్లేష్‌గౌడ్, సత్యం యాదవ్, యాదయ్య, శివస్వాములు మల్లేష్, శేఖర్, వెంకటచారి, నరేంద్రచారి, రాజు, శ్రీనునాయక్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి

ఆమనగల్లు , ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ 9వ వార్డు విద్యానగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు కోరారు. శనివారం ఈ మేరకు కాలనీ అధ్యక్షుడు ఏంఏ పాషా, ఉపాధ్యక్షుడు వర్కాల శేఖర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషన్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వేసవి నేపథ్యంలో మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇచ్చి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సీసీ రోడ్లు, అంతర్గత మురుగుకాల్వలు నిర్మించాలని, ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లను తొలగించాలని కోరారు. దోమలు, పందుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు పాషా పేర్కొన్నారు. కాలనీనాయకులు జంగయ్య, సుదర్శన్‌రెడ్డి, పాండు, పత్యానాయక్, పర్వతాలు, ఆరీఫ్, చంద్రశేఖర్ ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపాల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

చేవెళ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మున్సిపాల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శనివారం కార్మికులతో కలిసి మున్సిపాల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. స్పందించిన కమిషనర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

లక్ష్య సాధనకు కష్టపడి చదవాలి



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న చేవెళ్ల ఎస్సై శిరీష

చేవెళ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధన కోసం నిరంతరం కష్టపడి చదవాలని చేవెళ్ల ఎస్సై శిరీష అనానరు. ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్రీడోత్సవ్ బహుమతుల ప్రధానోత్సవాన్ని చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబుతో కలిసి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు కుంచం శ్రీనివాస్‌గుప్తా, కరుణాకర్‌రెడ్డి, ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహిపాల్, నగర అధ్యక్షులు శ్రీశైలం, నాయకులు నితీష్‌రెడ్డి, కిషోర్, విజయ్, ప్రేమ్, అరవింద్, రాఘవేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

యాచారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని యాచారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరేందర్‌రెడ్డి. వసంత్, శ్రీచరణ్, గీత, రవి, జ్యోతి, భవాని, ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వృద్ధురాలిపై అత్యాచారయత్నం కేసులో నిందితుడి రిమాండ్

యాచారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాల్‌లో గత డిసెంబర్9న రాత్రి 70 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ నిందితుడిని శనివారం రాత్రి యాచారం పోలీసులు రిమాండ్‌కు పంపారు. మండలంలోని నల్లవెల్లితండాకు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు మాల్‌లో యాచకురాలిగా ఉంటూ కాలం వెళ్లదీస్తుంది. మాడ్గుల మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామానికి చెందిన పోలే శ్రీశైలం(25) ఎరుగండ్లపల్లిలోని ఓ హోటల్‌లో లేబర్‌గా పని చేస్తుంటాడు. అతడు హోటల్ మూసిన తర్వాత రాత్రి వృద్ధురాలు ఒంటరిగా ఉండడం చూసి ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో రక్తగాయాలయ్యాయి. మరుసటి రోజు డిసెంబర్ 10న యాచారం పోలీసులకు తెలియడంతో బాధితురాలికి మాల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేసి నల్లవెల్లి తండాకు పంపించారు. బాధితురాలికి చికిత్స చేయించిన పోలీసులు ఆమెకు రక్తగాయం ఎలా అయ్యిందనే కోణంలో సీసీ కెమెరాలు పరిశీలించి నిందితుడిని పట్టుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల తర్వాత దారుణం బయటకు రావడంతో జనం రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ఈ ఘటన రాచకొండ పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో పోలీస్ కమిషనర్ స్పెషల్‌బ్రాంచి పోలీసుల చేత విచారణ చేయించినట్లు తెలిసింది. అప్రమత్తమైన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకొని విచారించారు. అయినా ఈ ఘటన బయటకు పొక్కలేదు. శుక్రవారం మధ్యాహ్నం మీడియాకు అసలు సమాచారం అందడంతో సీఐ నర్సింహారావుతో ప్రస్తావించగా వృద్ధురాలిపై అత్యాచారయత్నం జరిగిందని ధృవీకరించారు. డిసెంబర్ 10న పోలీసులు మాల్‌లో సీసీ కెమెరాలు పరిశీలించి ఉంటే ఆనాడే ఈ ఘటన వెలుగులోకి వచ్చేది. ఈ ఘటనపై రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది.

వైభవం.. శివపార్వతుల కల్యాణం

కేశంపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలోని సకల దేవతల ఆలయంలో శనివారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, కవిత దంపతులు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో విగ్రహాలను ఉంచి, పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణ తంతు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకుడు ఎల్లనమోని మురళీకృష్ణ యాదవ్, ఎల్లనమోని సురేష్ యాదవ్, వెంకన్న యాదవ్, బ్రహ్మచారి, శ్రీనివాస్, రాంచంద్రయ్య, మహేష్, లక్ష్మణ్, వెంకటయ్య, శ్రీహరి యాదవ్, గోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.



కల్యాణంలో మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, కవిత దంపతులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



పూజల్లో నాయకులు, భక్తులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నారం మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో సాక్షి గణపతి ప్రతిష్ఠ వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తోలి రోజు గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ, ప్రదోష పూజ, హోమం నిర్వహించారు. ఆదివారం నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపనకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కల్లు పెంటారెడ్డి, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, నారాయణరెడ్డి, బుచ్చిరెడ్డి, అశోక్, పాండురంగారెడ్డి, పాండయ్య, సులోచన, వసంత, అర్చకులు గోపాలశర్మ పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ సేవలో భక్తులు



చిలుకూరు ఆలయ ఆవరణలో మహాప్రదక్షణలు చేస్తున్న భక్తులు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయాన్ని శనివారం భక్తులు దర్శించుకొన్నారు. ఆలయం వెలుపల మహాప్రదక్షణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ ఆలయ విశిష్టతను వివరించారు.

వైభవంగా పెద్దమ్మతల్లి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కందుకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండంలోని పెద్దమ్మ తండాలో శనివారం పెద్దమ్మతల్లి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామ మాజీ సర్పంచ్ సుమన్‌నాయక్, నిర్వాహకులు లచ్చానాయక్ ఆధ్వర్యంలో ఉదయం 8గంటల నుంచి వేద పండితులు మొకరాల విజయభాస్కరశర్మ, సమక్షంలో అమ్మవారికి పంచమావ అభిషేకం, వస్త్ర పష్పాలంకరణ, కలశస్థాపన గణపతి హవనం, నవగ్రహ హవనం, సుదర్శన హవనం చేపట్టారు. ఉదయం 11.55 గంటలకు పెద్దమ్మతల్లి కల్యాణ తంతు నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ ఆలయ నిర్మాణానికి ఎంఎస్ఆర్ సేవా సంస్థ అధినేత మండడి నరేందర్‌రెడ్డి రూ.2.21 లక్షల విరాళాన్ని ప్రకటించారు. శనివారం ఎలికట్ట భవానీ మాత ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ముత్యాల రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు నరేందర్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో నారం శ్రీపాద్‌రెడ్డి, అచ్చంగారి యాదయ్య, ఆర్ల యాదయ్య, రామస్వామి పాల్గొన్నారు.